

న్యూస్ బాక్స్

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా శంకరయ్య నియామకం

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా సీనియర్ న్యాయవాది నేరెళ్ల శంకరయ్యను నియమిస్తూ జిల్లా జడ్జి ఉత్తర్వులు జారీచేశారు. సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సమక్షంలో బుధవారం మెజిస్ట్రేట్‌గా నేరెళ్ల శంకరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మెజిస్ట్రేట్ శంకరయ్యను సత్కరించారు. బార్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ కోరారు. రాజీ పడదగిన కేసుల్లో, క్రిమినల్ కంపోండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, వాహన బీమా, ఇతర చిట్‌ఫండ్ కేసుల్లో కక్షిదారులు రాజీపడవచ్చన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని, చిన్న చిన్న విషయాల్లో కక్షలు పెంచుకుని కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. న్యాయ శాఖ ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆయన సూచించారు.

- అంచనాల్లో 'స్మార్ట్'.. ఆచరణలో 'మాస్'..
- సీసీ రోడ్లు, యూజీడీల్లో అదే తంతు
- వీడీఎఫ్ ఫినిషింగ్ చేయని కాంట్రాక్టర్లు
- చాంబర్లలోనూ ప్లాస్టరింగ్ మాటే లేదు
- పట్టించుకోని అధికారులు



గోదావరిఖని ద్వారకానగర్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు

కోల్‌సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రామగుండం నగరాన్ని స్మార్ట్ సిటీ తరహాలో అభివృద్ధి చేయాలని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్‌ఐడీసీ) నుంచి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రూ.100కోట్లు మంజూరు చేయించారు. పనులు కూడా స్మార్ట్ సిటీ తరహా నాణ్యతతో ఉండాలని అంచనాలు రూపొందించారు. కరీంనగర్, వరంగల్ నగరాల్లో స్మార్ట్ సిటీ పనుల అంచనాలకు తగ్గట్టుగానే రామగుండం సీసీరోడ్లు, డ్రెయిన్ల అంచనాలు రూపొందించిన ప్రజారోగ్య శాఖ టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. రామగుండం నగరపాలక ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లకు అంచనాల్లో ఏ ఐటమ్‌లో తక్కువ కాకుండా రూపకల్పన చేశారు. కానీ పనులు మాత్రం నాణ్యతాలోపంతో సాగుతున్నాయి. పనులను దగ్గరుండి చూడాల్సిన రామగుండం ఇంజనీరింగ్ అధికారులు కానీ, నాణ్యతను పరిశీలించాల్సిన ప్రజారోగ్యశాఖ క్వాలిటీ కంట్రోల్ కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

రామగుండం నగర అభివృద్ధికి టీయూఎఫ్‌ఐడీసీ నుంచి రూ.100కోట్లు మంజూరయ్యాయి. దీనిలో మూడు ప్యాకేజీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనులను అప్పగించారు. 1 నుంచి 50డివిజన్లలో సీసీ రోడ్లకు రూ.20కోట్లు, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వ్యాపార కేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.29కోట్లు, మరో ప్యాకేజీలో ఓపెన్ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.16.5కోట్ల పనులను అప్పగించారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెండర్లలో పెద్ద కాంట్రాక్టర్లే పనులను దక్కించుకున్నారు. అంచనాల కంటే 4శాతం అధిక రేటుపై టెండర్లు పొందారు.

నగరపాలక సంస్థ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల పాత సీసీ రోడ్లు విస్తరణ చేసిన సమయంలో శిథిలమైన సీసీని తొలగించి నాలుగు అంగుళాల పీసీసీ వేసి నాలుగు రోజుల తరువాత ఆరు అంగుళాల సీసీ వేయాల్సి ఉంటుంది. రోడ్లు విస్తరణ చేసిన సమయంలో రోడ్డుకు ముందు పీసీసీ వేసి క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. తరువాతే సీసీ వేయాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలను ఎక్కడా పాటించడం లేదు. ఇష్టారాజ్యంగా ఒకేరోజు పీసీసీ, సీసీ వేస్తున్నారు. కొన్ని రహదారుల్లో 7 నుంచి 8అంగుళాల్లోనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. రామగుండంలో రహదారుల్లో నాణ్యత ఉండాలని, స్మార్ట్ సిటీ తరహా నిర్మాణాలు జరగాలని ఎమ్మెల్యే ఇంజనీరింగ్ విభాగంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ మేరకు కొత్తగా వ్యాక్యూమ్ డీవాటరింగ్(వీడీఎఫ్) విధానాన్ని అమలు చేసేలా అంచనాల్లో పెట్టారు. ఇందుకు

మిగతా 8వ పేజీలో...

● ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం..

నగరాభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరై పనులు జరుగుతున్నా రామగుండం ఇంజనీరింగ్ విభాగం మాత్రం నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. తగినంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈలు, ఈఈలతో పాటు ఎస్ఈ కూడా రామగుండం కార్పొరేషన్‌లో ఉన్నారు. ప్రతిరోజు సంబంధిత సైట్లను తనిఖీ చేసి పనులు ఏవిధంగా జరుగుతున్నాయో పనుల నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం కార్యాలయం దాటటడం లేదనే విమర్శలున్నాయి. వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రెండుమూడు సైట్లు అప్పగించి ఫీల్డ్‌పైకి వెళ్లకపోవడం వల్ల పనులు ఇష్టారీతిలో సాగుతున్నాయనే విమర్శలున్నాయి.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

8



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి

6

ఆకతాయిలకు ఏసీపీ కౌన్సెలింగ్



ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలో రాత్రి వేళల్లో తిరుగుతున్న ఆకతాయిలకు బుధవారం ఏసీపీ గజ్జి కృష్ణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాత్రి 10 గంటలు దాటిన తరువాత హోటళ్లు, పాన్‌షాపులు తెరిచి ఉండడంతో ఆకతాయిలకు అడ్డాగా మారిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ఇతర త్రా మత్తు పదార్థాలు తీసుకుంటున్నారన్నారు. ఇందుకు పాన్‌షాపులు కానీ ఏ ఇతర వ్యాపార దుకాణాలు గానీ పది గంటలకు మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. రాత్రిపూట ఆపరేషన్ ఛబూత్ర నిర్వహిస్తామని, పట్టుబడిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అవసరముంటే తప్ప ఆకతాయిలు బయట కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం హామీని వెంటనే అమలుచేయాలని జాక్ జిల్లా అధ్యక్షులు తిప్పని తిరుపతి అన్నారు. బుధవారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారి తెలుగు పండిత సంఘం నాయకులు సట్టు కనుకయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిదండపాణి సురేందర్‌కుమార్ వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైనా డిమాండ్‌లకోసం పోరాటం చేస్తున్నారని వారికి తక్షణమే ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి రాష్ట్ర నాయకురాలు పుల్లూరి సంధ్యారాణి, తాళ్లపల్లి మల్లయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే గ్యారంటీ పథకాలు

- బీజేపీ నాయకుడు గోమాస శ్రీనివాస్



చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మభ్యపెట్టడానికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు ప్రవేశపెట్టి ఇప్పటి అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు గోమాస శ్రీనివాస్, కందుల సంధ్యారాణి అన్నారు. బుధవారం రామగుండం నియోజకవర్గ యాత్ర ప్రముఖ్ మేరుగు హన్మంతుగౌడ్ ఆధ్వర్యంలో పైవింక్లయిన్ చౌరస్తా నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు మోసపూరితమైనవన్నారు. అవి ప్రజలను మభ్యపెట్టడానికేనని, ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే, అధికారం వచ్చి ఏడాది అయినా కాంగ్రెస్ పార్టీ చేసిందేమి లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయోత్సవాల పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రైతు భరసా, మహిళలకు రూ.2500 పథకం, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ రాబోయే రోజుల్లో రామగుండం నియోజకవర్గంలో కాషాయజెండా ఎగిరేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. ర్యాలీ పైవింక్లయిన్ నుంచి విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేష్‌నగర్, అడ్డగుంటపల్లి చౌరస్తా, లక్ష్మీనగర్ మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసిపేట శివాజీ, సోమారపు లావణ్య, పిడుగు కృష్ణ, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, జక్కుల నరహరి, గుండబోయిన భూమయ్య, కోడూరి రమేష్, బిట్టుపల్లి సతీష్, అంజి, మహేష్ పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలంపాట

కమాన్‌పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుకకు గురువారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు జీఎస్టీ లైసెన్స్‌తో హాజరుకావాలని, రూ.500 ధరావత్తు కట్టి హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

బీసీ సంఘ కార్యవర్గం

ధర్మారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొంగతుర్తిలో బీసీ సంక్షేమ సంఘ నూతన కమిటీని జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మ స్వామి, మండల అధ్యక్షుడు సాగంటి కొండయ్య అధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లైశెట్టి తిరుపతి, ఉపాధ్యక్షులుగా పాలకుర్తి బాపన్న, పుట్ట కొమురయ్య, లైశెట్టి రాజ్‌కుమార్, బొమ్మగాని నర్సింగం, ప్రధాన కార్యదర్శులుగా వేల్పుల శంకర్, కలివేని స్వామి, కోశాధికారిగా ముత్యాల సంతోష్, ప్రచార కార్యదర్శి పల్లపు సతీష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సత్కరించారు.

జర్నలిస్టుపై దాడి సరికాదు..

మార్కండేయకాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సినీ నటుడు మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన సంఘటనను కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టు రంజిత్‌పై మోహన్‌బాబు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న గోదావరిఖని ప్రెస్‌క్లబ్ ఒక ప్రకటనలో తెలిపింది. జర్నలిస్టుపై దాడికి పాల్పడిన మోహన్‌బాబుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన సీతారామయ్య

- ఏఐటీయూసీ నాయకుడు మినుముల రాజమౌళి

గోదావరిఖని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తనను మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తానని డబ్బులు వసూలు ఇప్పుడు ఇవ్వలేదని మోసానికి పాల్పడ్డాడని యూనియన్ అనుబంధ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు మినుముల రాజమౌళి ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 మేలో శ్రీరాంపూర్‌లో సీతారామయ్యను కలిసి మెడికల్ అన్‌ఫిట్ చేయించాలని కోరానని, డాక్టర్లతో మాట్లాడి చేయిస్తానని, దీనికి రూ.4 లక్షలు ఇవ్వాలని అడిగాడన్నాడు. మొదటి దఫా రూ.2లక్షలు ఇచ్చానని, తనకు బోర్డుకు పిలిచిన తరువాత తనతో పాటు సీతరామయ్య కొత్తగూడెం గెస్ట్‌హౌస్‌లో కలువగా డాక్టర్లతో మాట్లాడానని, బోర్డుకు వెళ్లమని చెప్పాడని, బోర్డు జరిగిన తరువాత తనకు ఫిట్ ఇచ్చారన్నాడు. సీతారామయ్యకు విషయం చెప్పానని, అప్పటి డైరెక్టర్‌తో మాట్లాడి అన్‌ఫిట్ చేయిస్తానని మాట ఇచ్చారని చెప్పారు. తరువాత ఫోన్ చేస్తే గుర్తింపు సంఘం ఎన్నికలు అయిన తరువాత చేస్తానని చెప్పారని, ఆ తరువాత కూడా నాలుగైదు సార్లు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. ఎవరైనా అడిగితే సర్వీస్‌లో ఉన్నానని చెప్పమని, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో మాట్లాడి పనిచేయిస్తానని నమ్మబలికాడన్నారు. సాంబశివరావు దగ్గరికి న్యాయం చేయమని తానే వెళ్లినా పని మాత్రం కాలేదన్నారు. తన రిటైర్డ్‌మెంట్ దగ్గరపడడంతో మెడికల్ బోర్డు చాన్స్ కూడా లేకుండా పోయి అన్యాయం జరిగిందని, తన కుటుంబం రోడ్డున పడ్డదన్నారు. దీంతో రెండు వారాల క్రితం గోదావరిఖని భాస్కర్‌రావుకు భవన్‌కు వచ్చిన సీతారామయ్యను కలిసి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగగా డబ్బులు ఇవ్వలేదు, గుళ్లో ప్రమాణం చేయాలంటూ తనపైనే దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఆరోపించారు. గతంలో 2ఇంక్లైన్‌పిట్ సెక్రటరీ పైడిపెల్లి రాజయ్య వద్ద కూడా రూ.3లక్షలు మెడికల్ అన్‌ఫిట్ కోసం తీసుకుని రెండేళ్ల తర్వాత డబ్బులు వాపసు చేశాడని, ఇలా కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ చేస్తానని మోసాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఏఐటీయూసీ యూనియన్ సీనియర్ కార్యకర్తగా కొనసాగుతున్న తనకే అన్యాయం జరిగిందంటే బయట ఎంతమందికి జరిగిందో ఆలోచించాలన్నారు. తనకు జరిగిన ఈ అన్యాయంపై కమ్యూనిస్టు యూనియన్లు, విప్లవ కార్మిక సంఘాలు ప్రశ్నించాలన్నారు. విలేకరుల సమావేశంలో దుర్గా ప్రసాద్, రాసపల్లి రవికుమార్, రజనీకాంత్, రాజమౌళి, నిఖిల్, లక్ష్మీనారాయణ, ఉదయ్, జైపాల్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



నాటుకు సిద్ధమైన పొలం



నాటుకు ఎదిగిన నారుమడి

ఓదెల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గతంలోకంటే ఈసారి నెలముందు నుంచే వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లించడంతో యాసంగిలో సన్నాల సాగు విస్తీర్ణం పెరిగింది. గత సీజన్‌లో మండలంలో రైతులు 21వేల ఎకరాల్లో సాగు చేయగా, 14 వేల ఎకరాల్లో సన్నరకం, 7వేల ఎకరాల్లో దొడ్డు రకం వరి ధాన్యాన్ని పండించారు. పెద్దపల్లి సభలో సీఎం సమక్షం లో మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ యాసంగి లో కూడా సన్నాలకు బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం తో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. యాసంగిలో 20 వేల ఎకరాల్లో సన్న రకం, దొడ్డు రకం వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా. ప్రభుత్వం మళ్లీ బోనస్ చెల్లిస్తుందో లేదోననే అనుమానంతో కొందరు రైతులు దొడ్డు రకం వరి ధాన్యాన్ని సాగు చేసేందుకు నారు మడులు సిద్ధం చేసుకున్నారు. అనురాధ కార్తె గత నెల 19న ప్రారంభంకంటే ముందు నుంచే రైతులు సన్న రకాల వరి పంటలకు నారుమడులు సిద్ధం చేసుకోగా, ప్రస్తుతం నాటువేసే దశకు రావడంతో, వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో కూలీల కొరత తలెత్తకుండా ముందస్తుగానే రైతులు నెల ముందు నుంచే డబ్బులు చెల్లించారు. ప్రభుత్వ హామీతో సన్న రకాల వరి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ మొక్కజొన్న, పత్తి తదితర వాణిజ్య పంటలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. రైతులు కేవలం ఐదు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు.

సకాలంలో నారు మడులు ఏర్పాటు చేసుకోవాలి..

రామగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో వరి నారు మడులను ఏర్పాటు చేసుకోవాలని ఏవో శ్రీకాంత్ సూచించారు. నారు మడుల ఆలస్యంతో వరిలో రాగి గొట్టం, కాండం తొలుచు పురుగు ఆశించి దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈనెల 20 లోగా నారుపోసి 25రోజుల్లోగా నాటు వేస్తే ఆశించిన దిగుబడి వచ్చే ఆస్కారం ఉంటుందని వెల్లడించారు. కాగా, మండలంలో పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో అనుకున్న మేరకు రాబడి రాకపోవడంతో దిగులుతో ఉన్న రైతులు యాసంగి వరి పంటపై దృష్టి సారిస్తున్నారు. వరి నారు మడుల ఏర్పాటుకు నీటి ఆధారిత ప్రాంతాల్లో రైతులు సమాయాత్తం అవుతున్నారు. వ్యవసాయ పంపుసెట్ల వద్ద ఇప్పటికే నారు మడుల ఏర్పాటుకు మడి సిద్ధం చేశారు.

సన్నాలకు బోనస్ ప్రకటించడంతో..

- పూరెళ్ళ రవి, కొలనూర్



సన్న రకాల ధాన్యానికి బోనస్ చెల్లిస్తుండడంతో మళ్లీ మూడు ఎకరాల్లో సన్న రకాల వారిని సిద్ధం చేస్తున్న. వానాకాలం పంటల సమయంలో కొంత నమ్మకం లేకుండే. యాసంగి సన్న రకాలకు కూడా మళ్లీ బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో ఈ సారి కూడా సన్నరకం సాగు చేశారు.

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నేతబజార్ లో ఎండు గంజాయిని నిల్వచేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ఒక ఇంటిలో సోదాలు నిర్వహించి 1.35కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న సయ్యద్ చాంద్, అన్వర్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.రాము తెలిపారు. ఈ సోదాలో సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, జగన్, రాము, శంకర్, సారికలు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు11,(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో సిరిసిల్ల పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన గుగులోతు హన్మంతు నాయక్‌కు 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.7వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2, 2017 సిరిసిల్లలో కార్గిల్‌లేక్ పెట్రోల్ బంకు వద్ద పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారని, హన్మం తు మద్యం తాగినట్లు తేలిందని పేర్కొన్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ బొంగొని నాగరాజు విధులకు ఆటంకం కల్గించాడని, హను మంతు నాయక్‌ను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసు పూర్వప రాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్తుడైన గుగులోతు హను మంతు నాయక్‌కు జైలు శిక్షతోపాటు జరిమానా విధించారని తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కొక్కుల సురేశ్ (32) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సురేష్ చోళ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు బయట తిరుగుతూ కనిపించాడు. బుధవారం ఉదయం సిరిసిల్ల పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో శవమై కనిపించాడు. సురేశ్ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకరికి విక్రయించిన భూమిని ఫోర్జరీ డాక్యుమెంట్ల సహాయంతో మరో వ్యక్తికి అమ్మి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాంనారాయణ వేములవాడ శివారులోని నందికమాన్ ప్రాంతంలో సిరిసిల్ల అంబేద్కర్ నగర్‌కు చెందిన రమేష్ ఏర్పాటు చేసిన వెంచర్‌లో 200 చదరపు గజాల స్థలాన్ని 2004లో కొనుగోలు చేశాడు. నెలరోజుల క్రితం రాంనారాయణ తన ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా అదే స్థలాన్ని ఫోర్జరీ డాక్యుమెంట్‌తో మరో వ్యక్తికి విక్రయించాడని తెలుసుకున్నాడు. దీనిపై రమేష్‌ను నిలదీశాడు. ప్లాట్ కావాలంటే అదనంగా రూ.లక్ష చెల్లించాలనడంతో ఇచ్చాడు. మరో రూ.50 వేలు కావాలని, ఇవ్వకుంటే ఎస్సీ ఎస్టీ కేసు పెడుతానని, కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించడంతో పోలీ సులకు ఫిర్యాదు చేశాడు,

వ్యక్తి మృతికి కారకుడైన నిందితుడికి రెండేళ్ల జైలు

గొల్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడిపి ఒకవ్యక్తి మృతికి, మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు కావడానికి కారకుడైన నిందితుడికి సెకండ్ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె. వినీల్ కుమార్ రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా, బాధిత కుటుంబానికి రూ.50వేల నష్టపరి హారం చెల్లించాలని బుధవారం తీర్పునిచ్చారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన గట్టు తిరుపతి (36) 2018 నవంబరు 19న తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మంచిర్యాల జిల్లా రెబ్బెనపెల్లి గ్రామానికి చెందిన జీలకర్ర రాజు మరో ఇద్దరిని తన ద్విచక్రవాహనం పై ఎక్కించుకుని అతివేగంగా వచ్చి తిరుపతి ద్విచక్రవాహనాన్ని అబ్బాపూర్ రెవెన్యూ శివారులో ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తిరుపతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు గొల్లపల్లి అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో బాధితుల పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీ వాదించారు. నిందితుడు రాజు చేసిన నేరం రుజువు కావడంతో సెకాండ్ అడిషనల్ జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో తమ వంతు పాత్ర పోషించి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచిన ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ దాసరి ఎల్లయ్య ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అజాగ్రత్త, అతివేగంతో లారీ నడుపుతూ ఓ విగ్రహ ధ్వంసానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం తెలిపారు. కోరుట్ల నుంచి లారీ చెరుకు లోడుతో కామారెడ్డికి వెళ్తుండగా రోడ్డుకు ఆనుకుని ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి తాకడంతో విగ్రహం పాక్షికంగా దెబ్బతిన్నది. స్థానికుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళలకు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ/జ్యోతినగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు మహిళలకు రామగుండం తహసీల్దార్ జైలు శిక్ష విధించినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. పీకే రామయ్యకాలనీకి చెందిన దేదావత్ మారు, మాలోతు మంజుల ఇద్దరు గతంలో నాటుసారా అమ్మకాల్లో పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్‌సీఐ తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి నాటుసారా అమ్మకాలు చేపట్టడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.లక్ష జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. జరిమానా కట్టనందుకు తహసీల్దార్ ఇద్దరు మహిళలకు మూడు నెలల జైలు శిక్ష విధించినట్టు పేర్కొన్నారు.

కాపర్‌వైరు చోరీ

● పట్టుకున్న టాస్క్‌ఫోర్స్



కాపర్ వైరు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి): గోదావరిఖని జీడీకే2వ గనిలో దొంగిలించిన కాపర్‌వైర్‌ను హైదరా బాద్‌కు అక్రమంగా రవాణా చేస్తుండగా బుధవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గోదావరిఖని అడ్డగుంటపల్లి వద్ద ట్రాలీని పట్టుకున్నారు. 65కిలోల కాపర్‌వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్ షాప్ నిర్వాహకుడు దొంతుల శ్రీనివాస్, డ్రైవర్ ముత్యాల ఐలయ్యను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-2 నిర్మాణానికి అంతా సిద్ధం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ)



- 800 మెగావాట్లకే రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ?
- వెయ్యి మెగావాట్లు కోరుతున్న ఆంధ్రప్రదేశ్
- బీహెచ్‌ఈఎల్ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు

జ్యోతినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) నిర్మాణానికి అంతా సిద్ధమైంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో 4,000 మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించేందుకు నిర్ణయించారు. ఫేజ్-1లో 1,600 మెగావాట్ల(800 మెగావాట్ల రెండు యూనిట్లు) ప్లాంటును నిర్మించారు. 2016లో టీఎస్‌టీపీపీ లో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, అనేక కార ణాల వల్ల ప్రాజెక్టు పూర్తి చేయడంలో జాప్యం జరి గింది. ఈ ఏడాదిలో స్టేజ్-1లోని రెండు యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో మిగతా 2,400 మెగావాట్ల(800 మెగావాట్ల మూడు యూనిట్లు) స్టేజ్-2ను నిర్మించేందుకు వేగంగా అడుగులు పడ్డాయి. టీఎస్‌టీపీపీ రెండో దశకు సంబంధించి గతంలోనే ఎన్టీపీసీ బోర్డు డైరెక్టర్ల అనుమతి లభించగా, తాజాగా పెట్టుబడి వ్యయం(బడ్జెట్) కూ డా ఎన్టీపీసీ బోర్డు ఆమోదం తెలిపింది. గత నెలలో జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో తెలంగాణ టీఎస్‌టీపీపీకి 29,345.85 కోట్ల భారీ పెట్టుబడి వ్యయాన్ని ఖరారు చేశారు. మరోవైపు స్టేజ్ నిర్మాణా నికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం చేయాల్సిన సాంకేతిక, పాలనా పనులు చకచకా పూర్తి చేస్తున్నది. ప్రస్తుతం స్టేజ్-1 ప్లాంటుకు ఆనుకుని ఉన్న స్థలం లోనే(మొత్తం 650 ఎకరాలు, స్టేజ్1,2) స్టేజ్-2 నిర్మించేందుకు కార్పొరేట్ ఇంజనీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించిది. స్టేజ్-2కు ఎలాంటి భూసే కరణ లేనప్పటికీ యాష్‌పాండ్ కోసం అంతర్గాం మండలం కుందనపల్లి శివారులో భూసేకరణ చేస్తోంది.

● 800 మెగావాట్లకే తెలంగాణతో పీపీఏ?

టీఎస్‌టీపీపీ స్టేజ్-2లో 2,400 మెగావాట్లలో 800 మెగావాట్లు(ఒకే యూనిట్)కు మాత్రమే విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకు నేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. 2,400 మెగావాట్లలో 800తెలంగాణ పీపీఏ చేసుకోవాలనుకుంటుండగా, 1000 మెగావాట్లు కావాలని ఆంధ్రప్రదేశ్ ఎన్టీపీసీని కోరుతు న్నది. మిగతా 600 మెగావాట్లను కేంద్రానికి కేటాయించే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 85శాతం విద్యుత్ తెలంగాణకే కేటాయించాల్సి ఉంటుంది. స్టేజ్-1లో 1600 మెగావాట్లలో 85శాతం తెలంగాణ రాష్ట్రానికే సరఫరా అవుతున్నది. అయితే కేవలం 800 మెగావాట్లకే పీపీఏ చేసు కునే విషయంలో ఏసమస్యా రాకుండా ఉండేం దుకు ఒక ఎక్స్‌పర్ట్ కమిటీనీ ఎన్టీపీసీ నియమిం చింది. పవర్‌పర్చేజ్ అగ్రిమెంటు విషయంలో ఈ నిపుణుల కమిటీ కసరత్తు చేస్తున్నది. త్వర లోనే పీపీఏ జరిగే అవకాశ ముంది. కాగా, ఈ సాంకేతిక అంశాల చర్చ జరుగుతున్న క్రమంలోనే మరోవైపు నిర్మాణపనులను ప్రారం భించేందుకు ఎన్టీపీసీ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నది.

● 19న ప్రజాభిప్రాయ సేకరణ..

స్టేజ్-2కు సంబంధించి ఈనెల 19న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. గత నెల 29న పబ్లిక్ హియరింగ్ జరగాల్సి ఉండగా, సీఎం పర్య టన కారణంగా వాయిదా పడింది. ఈక్రమంలో 19న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా పర్యావరణ, ఉపాధి, అభివృద్ధి తదితర అంశాలపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను తీసు కుంటారు.

● బీహెచ్‌ఈఎల్‌కు కాంట్రాక్టు..

టీఎస్‌టీపీపీ రెండో దశకు సంబంధించి నిర్మాణ కాంట్రాక్టు మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్) సంస్థకు దక్కింది. స్టేజ్-2 నిర్మాణంకోసం మూడు నెలల క్రితం గ్లోబల్ టెండర్లను ఎన్టీపీసీ ఆహ్వానించింది. ఎల్‌అండ్ టీ సంస్థ తక్కువ ధర కోడ్ చేయడంతో ఆ కంపెనీకే టెండరు ఖరారు కావాల్సి ఉంది. అయితే టీఎస్‌టీపీపీతో పాటు మరో రెండు ఇదే కెపాసిటీ గల ఎన్టీపీసీ ప్రాజెక్టుల టెండర్లకు సంబంధించి ఎల్‌అండ్ టీ తక్కువ ధర కోడ్ చేసి కాంట్రాక్టు దక్కించుకుంది. మూడు భారీ ప్రాజెక్టులను ఏకకాలంలో నిర్మించే విష యంలో ఇబ్బందులు ఎదురవుతాయనే విషయంలో బీహెచ్ ఈఎల్, ఎల్‌అండ్‌టీ మధ్య చర్చలు జరిగాయి. చివరికి తెలంగాణ ఎన్టీపీసీ నిర్మాణ కాంట్రాక్టును బీహెచ్‌ఈ ఎల్‌కు ఇచ్చేందుకు ఎల్‌అండ్‌టీ ఒప్పుకుంది. మొత్తం 29,345 కోట్ల(పెట్టుబడి వ్యయం) విలువైన మొత్తం నిర్మాణ పనులను బీహెచ్‌ఈఎల్ చేపట్ట నుంది. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలో మత ప్రచారం

● ఉపాధ్యాయుడిపై వేటు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మత ప్రచారానికి ప్రయత్నించిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగాల రాజును సస్పెండ్ చేస్తూ డీఈవో జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు ఓ మతానికి సం బంధించిన సామగ్రిని ఉపాధ్యాయుడు రాజు పంపిణీ చేశారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు అడ్డు కోవడంతో ఎంఈవో కృష్ణహరి పాఠశాలలో విచారణ జరిపి సమర్పించిన నివేదిక మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆమె భర్తపై కేసు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కోర్టు అనుమతి మేరకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ నీరటి భవానితో పాటు ఆమె భర్త భూమరాజంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. గ్రామంలోని బెస్త నరేశ్ కొడుకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. పిల్లలకు కోడిగుడ్లు అందించకపోవడంతో గతనెల 4న ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే నెల 5న నరేశ్ భార్య శిరీష తన కుమారుడిని తీసుకుని కేంద్రానికి వెళ్లగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై అంగన్‌వాడీ టీచర్ భవాని హెచ్చరించింది. దీంతో ఆమె తన భర్త నరేశ్‌కు జరిగిన విషయం చెప్పింది. మళ్లీ అధికారులకు ఫిర్యాదు చేయ డంతో చర్యలు తీసుకున్నారు. ఆగ్రహించిన అంగన్‌వాడీ టీచరుతోపాటు ఆమె భర్త అదే రోజు నరేశ్‌కు ఫోనుచేసి బెదిరించారు. గత నెల 6న బాధితుడి ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో అంగన్‌వాడీ టీచరు భవాని, ఆమె భర్త భూమరాజంపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

మల్యాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన శ్రీహర్ష రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక అయింది. రామానుజన్ జయంతి పురస్కరించుకొని జగిత్యాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో బుధవారం పదవతరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఇందులో శ్రీహర్ష జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపిక కాగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



శ్రీహర్షను అభినందిస్తున్న నిర్వాహకులు, అధ్యాపకులు

క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన పూడూర్ వాసి



విన్నర్ కప్ అందుకుంటున్న వెంకటసంజయ్

కొడిమ్యాల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన మరక వెంకటసంజయ్ అండర్ 14 తెలంగాణ క్రికెట్ జట్టులో నెంబర్ 3 బ్యాట్స్‌మెన్‌గా ఆడి ప్రతిభ కనబరిచాడు. వెంకటసంజయ్ ఈ నెల 7 నుంచి 9 వరకు గోవాలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ లో పాల్గొని జాతీయ స్థాయి టీంకు ఎంపికయ్యాడు. 2025 జనవరి చివరి వారంలో శ్రీలంకలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయిలో 20-20, వన్‌డే, అండ్ టెస్ట్ మ్యాచ్‌లలో బీసీసీఐ భారత జట్టు తరుపున ఆడనున్నాడు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొననున్న వెంకటసంజయ్‌కు పూడూర్ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

తక్కువ ధరకు సిమెంట్ ఇస్తామంటూ మోసం..

- ఫేక్ కంపెనీ పేరిట ఆన్‌లైన్‌లో పోస్టు
- ఐదు లక్షలు చెల్లించిన కాంట్రాక్టర్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేస్తామంటూ ఓ ఫేక్ కంపెనీ పేరుతో మోసగాళ్లు ఆన్‌లైన్‌లో ప్రకటన పెట్టారు. అది చూసిన కాంట్రాక్టర్లు నాలుగు లక్షల 45వేలు చెల్లించారు. ఎంతకూ సిమెంట్ రాకపోవడంతో మోసపోయామని తెలిసి బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వివరాలు ఇలా ఉన్నాయి. తక్కువ ధరకు సిమెంట్ సప్లై చేస్తామని, కావల్సిన వారు తమను సంప్రదించాలంటూ ప్రియ సిమెంట్ వర్క్స్, పెద్ద పల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి అడ్రస్ పేరిట ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించింది. అది చూసిన వరంగల్ జిల్లా నర్సంపేటకు చెంది న ఇద్దరు కాంట్రాక్టర్లు ప్రకటనలోని సెల్‌ఫోన్ నంబరులో సంప్రదించారు. పలు దఫాల్లో నాలుగు లక్షల 45వేల రూపాయలు బ్యాంకు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎంతకు సిమెంట్ రాకపోవడంతో బుధవారం సుల్తానాబాద్‌కు చేరుకొని ఆరా తీశారు. వారు పంపించిన కొటేషన్‌లో ఉన్న అడ్ర స్‌లో అసలు ఎలాంటి కంపెనీ లేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల సూచన మేరకు ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు



లక్ష్మీపూర్ మహాత్మజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న రేవతిరావు

జగిత్యాలరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రేవ తిరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు తాజాకూరగాయలతో నాణ్యమైన భోజనంతో కూడిన వంటకాలు చేయాలని సూచించారు. లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే విద్యార్థులు కాస్మొటిక్స్ కోసం రోడ్డెక్కి ధర్నా చేసిన విషయం తన దృష్టికి రావడంతో పాఠశాలను తనిఖీ చేశానని తెలిపారు. విద్యా ర్థుల తల్లితండ్రులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించవద్దని పాఠ శాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్త బియ్యం తినడం వల్ల కొంత ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు రేవతిరావుకి విన్నవిం చారు. వంట మనుషులతో వారానికొకసారి ప్రిన్సిపల్ సమావేశం నిర్వహించాలని, ఏవైన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేష్, సీడీపీవో మమత, సూపర్‌వైజర్ పవిత్ర, పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్స వంలో భాగంగా బుధవారం ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రసంగిస్తూ విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితశాస్త్రం ఎనలేని పాత్ర వహిస్తుందన్నారు. గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనివాస రామా నుజన్‌ను ఆదర్శంగా తీసుకొని యువత గణిత శాస్త్ర మేధా వులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పి.నితిన్, సాంఖ్యశాస్త్ర విభాగ అధిపతి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యా ర్థులకు మున్సిపల్ కమిషనర్ బహుమతులను అందజేశారు



మాట్లాడుతున్న కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

అనంతరం విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై ఒక నాటికను ప్రదర్శించారు.

పిల్లల నడవడికపై శ్రద్ధ వహించాలి

- విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను అలవర్చుకోవాలి
- ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి
- ఎన్టీపీసీలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం



విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

జ్యోతినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే శాస్త్రీయ ఆలోచనలను అలవర్చుకొని ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించు కోవాలన్నారు. బుధవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న 3రోజుల జిలా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రసంగిస్తూ ఆధునిక సాంకే తిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తమ వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఇదే సమయం లో తల్లిదండ్రులు సైతం పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని సన్మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత అని అన్నారు. జిల్లా విద్యాధికారి డి.మాధవి మాట్లాడుతూ ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. అలాగే ప్రదర్శనలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, స్నేహితులతో సఖ్యతగా ఉండడం నేర్చుకుంటారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు ప్రసంగిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయసాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో జిల్లా విద్యార్థులు సాధించిన అవార్డుల వివరాలను వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలిపాక సుజాత, రామగుండం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. మోహన్, ఎంఈవోలు టి.విమల, కె.ఏకాంబరం, స్వర్ణలత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం సందర్భంగా విద్యార్థులుచేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది.

ఒలింపిక్ సంఘంలో ఉమ్మడి జిల్లావాసులకు చోటు


జనార్దన్‌రెడ్డి, మహేందర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలింపిక్ సంఘంలో ఉమ్మడి జిల్లావాసులకు చోటు దక్కింది. ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి సంయుక్త కార్యదర్శిగా రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా పెద్దపల్లి జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం ఎన్నికల అధికారి ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో ఒలింపిక్ సంఘం కార్యవర్గ ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ఎన్నికల అధికారి, రిటైర్డ్ హైకోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి 40 సంవత్సరాలుగా క్రీడా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన సిలివేరి మహేందర్ సీనియర్ ఖో-ఖో క్రీడాకారుడిగా పదికిపైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలను సాధించారు. వీరిని ఉమ్మడి జిల్లాకు చెందిన ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు నందెల్లి మహి పాల్, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వివిధ జిల్లాల డీవైఎస్‌వోలు, క్రీడా సంఘాల రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు అభినందించారు.

అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుంది

- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి


గో పూజ చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

కోరుట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య బారతీ స్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి ఆలయంలో పట్టణానికి చెందిన జుంబర్తి రమేష్ గురుస్వామి 18వసారి దీక్ష స్వీకరించగా వేదపండింతుడు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య అయ్యప్ప పడి పూజ మహోత్సవం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించి అష్టోత్తర కార్యక్రమాలను జరిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హంపీ పీఠాధిపతి దేవాలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జుంబర్తి రమేష్ స్వామికి విద్యారణ్య భారతి స్వామి దర్మదండంను అందించి ఆశీర్వదించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యా-అనిల్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జుంబర్తి రమేష్ అయ్యప్ప స్వాములతో పాటు భక్తులకు అన్న ప్రసాదం అందించంగా అధిక సంఖ్యలో భక్తులు, స్వాములు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. మార్గశిర మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో మల్లన్న భక్తులకు తోడుగా సాధారణ భక్తులు స్నానాలు ఆచరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నరసింహమూర్తి, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలను సీఎం సందర్శించాలి

సారంగాపూర్, డిసెంబరు, 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రతీరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆసుపత్రుల్లో చేరడంతో సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయందోళన నెలకొందన్నారు. కనీసం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఒక్కసారి కూడ సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకోలేదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమీక్ష జరిపి ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

సూరమ్మ చెరువు ఎడమ కాలువకు భూములు ఇవ్వం


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఇప్పపల్లి రైతులు

కథలాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలికోట సూరమ్మ చెరువుకు నిర్మించనున్న ఎడమ కాలువకు భూములు ఇవ్వమని మండలంలోని ఇప్పపల్లి రైతులు స్పష్టం చేశారు. బుధవారం గ్రామంలో భూసేకరణ నిమిత్తం తహసీల్దార్ వినోద్ రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఇప్పపల్లిలో 39 ఎకరాల భూమి కాలువ నిర్మాణానికి అవసరమని అధికారులు గుర్తించగా రైతుల అంగీకారం కోసం సమావేశం ఏర్పాటు చేశారు. అయితే తాము చిన్న, సన్నకారు రైతులమని ఉన్న భూములు కోల్పోతే బతుకులు ఆగమవుతాయని అధికారులకు వివరించారు. భూములు కాలువ కోసం ఇవ్వబోమని పేర్కొంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఊరికి అండగా వలస జీవులు



● గల్ఫ్‌లో ఉంటూ గ్రామాల్లో అభివృద్ధి పనులు ● ఉన్న ఊరిపై మమకారంతో సేవా కార్యక్రమాలు



గంభీర్‌పూర్‌లో గల్ఫ్ సంఘం వారు నిర్మించిన బస్టాండ్

కథలాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ వెళ్లిన వలసజీవులు కన్న ఊరిపై మమకారాన్ని మరచిపోవడం లేదు. వచ్చిన జీతంలో కొంత పొదుపు చేసుకోవాలనే భావనతో పొదుపు సంఘం ఏర్పాటు చేసుకుని ప్రతి నెలా డబ్బు జమ చేసుకుంటున్నారు. పోగేసుకున్న డబ్బులను కొందరు అత్యవసర పనులకు వాడుకుని మళ్లీ నిర్ణీత నెలలకు వడ్డీతో సహా సంఘంలో జమచేస్తారు. ఇలా గత పదేళ్లగా డబ్బులు భారీగా జమకావడంతో తమ సొంతూళ్ల అభివృద్ధికి వెచ్చించాలనే ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.

● ఆధ్యాత్మికతకు ప్రథమ ప్రాధాన్యం

అడవుల్లో విసిరేసినట్టు ఉన్న తుర్తి, పోతారం, అంబారిపేట వంటి మారుమూల గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఉపాధి అవకాశాలు లేక కేవలం వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉండడంతో యువత దుబాయి, సౌదీ అరేబియా, కువైట్, బెహరాన్, మస్కట్ వంటి గల్ఫ్ దేశాల బాట పట్టారు. అక్కడ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న క్రమంలో సొంతూరుకు కొంత మేలు చేయాలని అనుకున్నారు. మొదటగా ఆధ్యాత్మికతను పెంచుకోవాలనే తలంపుతో ఆలయాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అంబారిపేటకు చెందిన 55మంది గల్ఫ్ వలస కార్మికులు దాదాపు రు. 70లక్షలతో రామ మందిరం నిర్మించారు. సౌదీలో ఉన్న సంఘ సభ్యులు రు.12 లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. రు.70 వేలతో బాడీ ఫ్రీజర్ గ్రామానికి అందజేశారు. ఆలయంలో నిత్యం పూజలు నిర్వహించడానికి పూజారికి నెల నెలా వేతనం చెల్లిస్తున్నారు. ఏటా శ్రీరామ నవమిన భక్తులకు అన్నదానం చేస్తున్నారు. తుర్తిలో పదేళ్ల కిందటే రు. 5 లక్షలతో హన్మాన్ ఆలయం, సుమారు రు. 2.50 లక్షలతో దుర్గమ్మ దేవాలయం, లక్ష రూపాయలతో బోరు, పాఠశాలలో విద్యార్థుల కోసం షెడ్ ఏర్పాటు చేశారు.

● పోతారం కార్మికులు వంద మందితో...

పది సంవత్సరాల కిందట పది మందితో ఏర్పడ్డ పోతారం గల్ఫ్ వలస కార్మికులు ప్రస్తుతం వంద మందితో సంఘం ఏర్పడింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లొంకరామేశ్వరస్వామి వద్ద రు. 10 లక్షలతో భక్తులు సేదదీరడానికి కల్యాణ మంటపం నిర్మించారు. కలికోటకు వెళ్లేదారిలో ఉన్న మర్రవ్వ ఆలయం వద్ద భక్తుల కోసం రు. 2 లక్షలతో షెడ్, పాఠశాలలో విద్యావలంటీర్ల కోసం నెలకు రూ 15వేలు వెచ్చిస్తున్నారు. అదేవిధంగా రూ. 40వేలతో పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్లు, స్కూల్ ఆకర్షణీయంగా కనిపించేందుకు రు. 70వేలతో పెయింటింగ్ వేయించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు దోహదం చేస్తున్నారు. ఆపద సమయంలో పేదలకు పలు సందర్భాల్లో ఆర్థికంగా చేయూత అందించారు. సప్త సముద్రాల అవతల ఉన్నా తమ కన్న ఊరిని మరిచి మరిచిపోకుండా అభివృద్ధి కోసం మరింత పాటు పడతామని గల్ఫ్ కార్మికులు పేర్కొంటున్నారు.


భక్తుల కోసం నిర్మించిన కల్యాణ మండపం


అంబారిపేటలో నిర్మించిన రామమందిరం

'పిల్లలకు కాలం చెల్లిన మందులు ఇస్తారా?'


మందులను పరిశీలిస్తున్న దావ వసంత

జగిత్యాల అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో కనీస వసతులు లేక అస్వస్థతకు గురై చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన పిల్లలకు కాలం చెల్లిన మందులిస్తారా అంటూ జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆగ్రహం వ్యక్తం చేశారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం తెలుసుకున్న వారు మాతా శిశు కేంద్రంలో విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మందులను చూసి విస్మయం చెందారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఆమె వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక, కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సాగి సత్యం, చింత గంగాధర్, రిజ్వాన్, ప్రణయ్ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించ నున్నారు. కొత్తపల్లి సమీపంలోని అకాడ మిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2010 తర్వాత జన్మించినవారు అర్హులని తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జనవరిలో నిర్వహించే ఆల్‌ఇండియా అంతర జిల్లాల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, స్టడీ సర్టిఫికెట్లతో సంఘ సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, పాఠశాల పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలు


రాజన్న ఆలయంలో భగవద్గీత పఠనం చేస్తున్న విద్యార్థులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీగీతా జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాజన్న ఆలయంలో బుధవారం తెల్లవారు జామున ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం స్వస్తి పుణ్యహవచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కాగా ఆలయ నాగిరెడ్డి మండపంలో గీతాహోమం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల విద్యార్థులు పాల్గొని భగవద్గీత పఠనాన్ని చేశారు. శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గర్శకుర్తి వెంకటేశ్వర్లు, మోటూరి మధు, రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం


అయ్యప్ప స్వామికి చక్రస్నానం చేయిస్తున్న గురుస్వామి, సిరిసిల్లలో అయ్యప్పస్వామి శోభాయాత్ర

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో అయ్యప్ప అరట్టు ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరుల నృత్యాలు, శరణు ఘోషతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం మానేరు నదిలో గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అర్చనలు, అభిషేకాలతోపాటు చక్రస్నానం చేశారు. అనంతరం సాయినగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, మధుసూదన్, కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న విరాహత్ అలీ

తిమ్మాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల తాపాల నృసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్రవర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విరాహత్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్యాగాలు, ఉద్యమాల మీద యూనియన్ ఏర్పడిందని, వ్యక్తుల వల్ల కాదన్నారు. యూనియన్‌లో చెమడొడ్చి పనులు చేసే నాయకులు, యూనియన్ నిబంధనలకు అనుగుణంగా పనిచేసే నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించకపోవడంతో జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ నిలిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య అందజేస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, ఈ విషయంపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో కలిసి చర్చించామన్నారు. త్వరలో ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్ స్కీం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీనితో పాటు అక్రిడిటేషన్లకు సంబంధించి విధివిధానాలు త్వరలోనే వెలువడతాయన్నారు. ఇళ్ల స్థలాలు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విరహత్ అలీ తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారి జిల్లాకు వచ్చిన విరాహత్ అలీ, కె రాంనారాయణను జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, పరిశీలకులు కె రాజారెడ్డి, జిల్లా నాయకులు గాండ్ల శ్రీనివాస్, ఈద మధుకర్‌రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కామర్స్ జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మిన్‌స్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో జనవరి 7,8 తేదీ ల్లో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు నిర్వహణ కార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ఎస్ఆర్ ఆర్ కళాశాల అధ్యాపక బృందంతో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్ డిగ్రీ కళాశాల లను బుధవారం సందర్శించి అవగాహన సదస్సు కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఆయా కళాశాలల బాధ్యులు డాక్టర్ అశోక్, ఆచార్యరామకృష్ణ, శ్రీపాద నరేష్, యాద రామకృష్ణ, రాజేందర్, కార్యక్రమ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లికార్జున స్వామి ఆలయం

బోనాలు సమర్పించిన భక్తులు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి బుధవారం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో గర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకుని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు నల్ల బంగారం (బెల్లం) తులాభారం వేసి భక్తులకు పంచిపెట్టారు.

ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్నపట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్‌శర్మ, కొండూరి రఘునందన్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు ఉచిత సేవలను అందించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తదితరులు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా గీతా జయంతి

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గీతాగోష్టి ప్రతినిధులు, శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ, ఐతు మానస, నగునూరి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధంకావాలి

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలనే డిమాండ్‌తో మరో ఉద్యమానికి సిద్ధంకావాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గుండా థామస్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం చిన్నకలువల గ్రామంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈనెల 12న సుల్తానాబాద్‌లో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ కార్యవర్గం ఎన్నికలు జరుగుతాయని, అందరూ సమావేశానికి హాజరుకావల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో కనకం శంకర్, గంగారం, ఎల్లయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందనలు

ఓదెల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన క్యాతం లక్ష్మి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాతలతో సంస్మరణ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మేర్గు భీష్మచారిలు మృతురాలి కుటుంబ సభ్యులు క్యాతం సత్యనారాయణ, క్యాతం రవీందర్ కుటుంబాలను అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక సహాయం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ స్ఫూర్తి ఆఫ్ గోదావరిఖని ఆధ్వర్యంలో బుధవారం లేబర్ అడ్డా వద్ద నిరుపేదలకు కాంట్రాక్టర్ చింతల సతీష్ ఆర్థిక సహాయంతోపాటు అమ్మపరివార్ అనాథ ఆశ్రమంలో పిల్లలకు 50కిలోల బియ్యం, ప్రభుత్వ పాఠశాలకు బీరువా, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నార్ల ప్రసాద్, ప్రధానకార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారి కోదాటి ప్రవీణ్, జయప్రకాశ్ చౌడ, కొల్లూరు విజేందర్, తాటిపల్లి రాజ్‌కుమార్, సింహాచలం రత్నాకర్, నల్లాస్ మల్లికార్జున్, బొల్లి రవికుమార్, రెడ్డి రవీందర్‌రెడ్డి, పోల్సాని గంగరాజు, తూముల సంతోష్‌రావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆపన్నహస్తం

రామగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నరేందర్ కుటుంబానికి బుధవారం రేండ్ల శారద కుమారస్వామి(ఆర్ఎస్‌కె) అపన్నహస్తం అందించారు. పేదరికంలో ఉన్న మృతుడి దహన సంస్కారాల ఖర్చులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఉన్న చంద్రశేఖర్ నరేంద్రకు వైద్య ఖర్చులను అందించిన రేండ్లశారద కుమార్‌స్వామి మృతుడి పిల్లలకు చదువుల కోసం తనవంతుగా ఆర్థికసహాయం అందిస్తానని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.

నియామకం

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఓదెల మండలం ఉప్పరపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నడిపెల్లి సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధానకార్యదర్శి సదానందగౌడ్ తెలిపారు. నడిపెల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు



మంథనిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్‌పర్సన్ రమ

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడాపోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయబోతున్నారన్నారు. గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు నిలయమైన సుల్తానాబాద్‌లో ఎంతో మంది క్రీడల ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. ఈ ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహించిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు స్మారకార్థం తెలంగాణ రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను త్వరలోనే నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకు తగిన కార్యాచరణ తయారుచేయాలని స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ తదితరులకు సూచించారు. అంతకుముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సురేష్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సాయిరి మహేందర్, బిరుదు క్రిష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేగళం అబ్బయ్యగౌడ్, అమిరిశెట్టి తిరుపతి, కిశోర్, పల్లా సురేష్, ఆవుల శివ, మోబిన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ ఐఎంఎస్ పాఠశాల మైదానంలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో పొల్సాని శశికళ ప్రారంభించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో బుధవారం బాలురకు నిర్వహించామని, గురువారం బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో శైలజ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, ఎంఈవో కొంరయ్య, ఎంపీవో ఉమేశ్, మెడికల్ అధికారి ఉమేష్, ఏఎస్ఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో మంథని మున్సిపల్ పరిధిలోని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మున్సిపల్ స్థాయి కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించిన క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. చదవుల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవి, కొమురోజు శ్రీనివాస్, మాధురితో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో లలిత హాజరై క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు పోటీల్లో ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీవో భాస్కర్, కార్యదర్శులు రాజ్‌కుమార్, బచ్చల భాస్కర్, పీఈటీ రేణుక, సావిత్రిలు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన ఏడీఏ

మంథని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్ల షాపులను మంథని ఏడీఏ ఎస్ అంజనీ బుధవారం తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్, రిజిష్టర్లను ఆమె పరిశీలించారు. షాపుల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులందరు తప్పని సరిగా రసీదు తీసుకోవాలని ఆమె సూచించారు. అంతకుముందు మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీ శివారులోని పంటపొలాలను పరిశీలించి వరి కొయ్యలను కాల్చకూడదని రైతులకు సూచించారు. ఆమె వెంట వ్యవసాయాధికారులు ఉన్నారు.

వెంచర్ పనులను అడ్డుకున్న దళితులు

మంథని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని గంగాపురి-కూచిరాజ్‌పల్లి గ్రామాల శివారులోని కొందరు తమకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో వెంచర్ డెవలప్‌మెంట్ పనులు చేస్తుండగా బుధవారం తాము అడ్డుకున్నట్లు గ్రామానికి చెందిన దళితులు తెలిపారు. 1983లో వచ్చిన వరదల కారణంగా తాము ఆ స్థలాన్ని ఖాళీ చేసి ప్రస్తుతం ఉన్న కూచిరాజ్‌పల్లి వద్ద నివాలు ఏర్పాటు చేసుకోగా తమ భూములను గౌతం సత్యనారాయణ అనే వ్యక్తి కబ్జా చేశాడని తెలిపారు. ఇంతకాలం తమను మభ్యపెట్టి ప్రస్తుతం ఇతరులకు అమ్మగా వారు వెంచర్ డెవలప్‌మెంట్ కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించగా తాము అడ్డుకున్నామన్నారు. తమ భూమిని తమకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూడపాక మల్లేష్, నాగెల్లి జానీ, బూధమ్మ, శ్రీధర్, శంకర్, భూమయ్య, సమ్మయ్య, నర్సమ్మలు పాల్గొన్నారు.

తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

కమాన్‌పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ మెప్పు పొందేలా వ్యవహరిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంత్రి, ఆయన సోదరుడి మెప్పు పొందేందుకు కాంగ్రెస్ నాయకులు పనిగట్టుకొని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సరైన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, పెంచికల్‌పేట మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు నీలం శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం

ఓదెల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వివేకానంద విద్యాల యంలో ఈనెల 14న, గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ తెలిపారు. వివరాల కోసం 9618113729 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గోదావరిఖనిలో పోలీసుల తనిఖీలు

కోల్‌సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు బుధవారం రాత్రి స్థానిక మెయిన్‌చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలతో పాటు వాహనాల డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు

(5వ పేజీ తరువాయి)



శిథిలమైన చాంబర్ చూట్టే సీసీ రోడ్డు

స్క్రీడ్ వైబ్రేటర్ వినియోగించాల్సి ఉంటుంది. ఈ విధానంలో రోడ్డు నిర్మాణంలో అదనపు నీటిని వ్యాక్యూమ్ ద్వారా తొలగిస్తున్నారు. దీని వలన రోడ్డుకు అధిక సామర్థ్యం వస్తుంది. పగుళ్లు నివారించడమే కాకుండా అధిక లోడ్‌లను కూడా తట్టుకుంటుంది. వీడీఎఫ్ టెక్నాలజీతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో మొదటగా వినియోగించారు. తరువాత స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అయిన కరీంనగర్, వరంగల్‌లోనూ వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రామగుండంలో అంచనాల్లో రూపొందించారు. కానీ అమలులో మాత్రం వీడీఎఫ్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. వీడీఎఫ్ యంత్రాలు, కార్మికుల ఖర్చులు, ఇంధనం తదితర పనులకు చదరపు మీటర్‌కు అదనంగా రూ.85.21అంచనాల్లో రూపొందించారు. అంటే 400మీటర్ల రహదారికి రూ.లక్ష అదనంగా వ్యయం అవుతుంది. ఇటీవల గోదావరిఖని దుర్గానగర్, ఎన్‌టీఆర్‌నగర్, ద్వారకానగర్, తదితర ప్రాంతాల్లో వీడీఎఫ్ టెక్నాలజీతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దుర్గానగర్‌లో క్యూరింగ్‌లో మట్టితో కట్టలు కట్టి సరిగా క్యూరింగ్ చేయలేదనే ఆరోపణలున్నాయి. దుర్గానగర్‌లో ఒకటి రెండు చోట్ల సీసీ పగుళ్లు కూడా ఇచ్చింది. వీడీఎఫ్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం జరిపిన తరువాత ఏళ్ల తరబడి రోడ్డు మన్నికతో ఉంటుంది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాల్లోనూ..

రామగుండం నగరపాలక సంస్థలో లక్ష్మీనగర్‌లో ప్యాకేజీ పనులు మొదలుపెట్టిన ఏజెన్సీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పైప్‌లైన్లు వేసే సమయంలో సరైన ప్రమాణాలు పాటించకపోవడం, పైప్‌లైన్ల కింద డస్ట్, ఇసుక వంటివి వేయడం లేదు. చాంబర్ల నిర్మాణాలు మరీ అధ్వానంగా చేస్తున్నారు. చాంబర్ల లోపల కనీసం ప్లాస్టరింగ్ చేయడం లేదు. దీనిపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేని పరిస్థితి ఉంది.

ఎమ్మెల్యే, కలెక్టర్ మందలించినా..

కార్పొరేషన్ పనుల్లో నాణ్యతలో రాజీపడేది లేదని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ప్రతివారం కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లు ఎప్పటికప్పుడు మందలిస్తూనే ఉన్నారు. స్మార్ట్ సిటీ తరహాలో పనులు ఉండాలని చెబుతున్నా మళ్లీ అదే తంతు కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి.

ఓరుగల్లు దాటని క్వాలిటీ కంట్రోల్..

రామగుండంలో టీయూఎఫ్ఐడీసీ పనుల్లో నాణ్యతను తనిఖీ చేసేందుకు ప్రజారోగ్యశాఖ ఇంజనీరింగ్ విభాగానికి బాధ్యతలు అప్పగించారు. వరంగల్‌లో దీనికి సంబంధించి ప్రత్యేక కార్యాలయం కూడా ఉంది. టీయూఎఫ్ఐడీసీ పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత క్వాలిటీ కంట్రోల్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు మాత్రం రామగుండంలో పనులు జరుగుతున్న సైట్లకు రావడం లేదనే ఆరోపణలున్నాయి.

బ్రష్‌తో గీతలు పెట్టారు..

- ఈశ్వరయ్య, ద్వారకానగర్

రోడ్డు నిర్మాణం చేసిన తరువాత పైన కట్టెకు బ్రష్ కట్టి గీతలు పెట్టారు. రోడ్డు పనులు మంచిగా జరిగేలా అధికారులు చూడాలి. రోడ్డు ఎళ్లకాలం ఉండేలా చూడాల్సింది అధికారులే.

పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం..

- ఈఈ రామన్

రామగుండం నగరపాలక సంస్థలో టీయూఎఫ్ఐడీసీ పనులను ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వీడీఎఫ్ మిషన్‌తో ఫినిషింగ్ చేయిస్తున్నాం. లక్ష్మీనగర్‌లో కొంత ఇబ్బంది అయ్యింది. చాంబర్లకు ప్లాస్టరింగ్ చేయాలని కాంట్రాక్టర్లకు చెప్పాం. ప్రస్తుతం ప్లాస్టరింగ్ పనులు జరుగుతున్నాయి. నాణ్యత విషయంలో రాజీపడేది లేదు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే నేరమా?

- ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మణ్

పాలకుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించడమే నేరమా అని ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాణాపూర్ గ్రామంలో మావోయిస్టు నేత ఏగోలపు మల్లయ్య సంస్మరణ సభ జరిగింది. సభకు హాజరైన గడ్డం లక్ష్మణ్ మట్లాడుతూ ప్రజల పక్షాన మాట్లాడినందుకు ఈనెల 1న ములుగు జిల్లా ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతంలో పట్టుకొని మల్లయ్య అలియాస్ మధును తెలంగాణ ప్రభుత్వం కాల్చి చంపిందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన నాలుగు సంఘటనలపై హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మల్లయ్య సహచరి మీనా మాట్లాడుతూ తన భర్తది ముమ్మాటికి బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లయ్య సోదరులతో పాటుఅమరవీరుల బంధు మిత్రుల కమిటీ సభ్యులు సత్యపౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్‌పై అవగాహన

ఎలిగేడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అభ్యుదయ మండల సమాఖ్యలో స్వశక్తి గ్రూపు మహిళలకు షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా షీటీం ఇంచార్జ్ ఏఎస్సై మల్లన్న మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు. ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, మహిళలకు ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుధాకర్, షీటీం సభ్యులు స్నేహలత, సీసీలు ఆనంద్, జ్యోతి, మల్లేశం, వీవోఏ, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న తహసీల్దార్ తదితరులు

పాలకుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలానికి మంజూరైన 33 కళ్యాణ లక్ష్మి, ఒకటి షాదీ ముబారక్ చెక్కులను బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ ఎం జ్యోతి, ఎంపీడీవో పొల్సాని శశికళ, మక్కాన్‌సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్‌లు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో రాలేకపోయారని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పలు గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సమష్టి నిర్ణయాలతో సత్ఫలితాలు సాధ్యం..

- ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమష్టి నిర్ణయాలతో సత్ఫలితాలు సాధించవచ్చునని ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ అన్నారు. బుధవారం జీడీకే 2, 2ఏ గనిలో జీఎం ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాల గురించి తెలియజేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవడం కోసం వివిధ సెక్షన్లకు సంబంధించిన వారు సమష్టిగా ఏర్పడి సమాలోచనలు చేసి వాటిని అమలుచేయాలన్నారు. దీంతో ఉత్పత్తి, ఉత్పదకతలు పెంచేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణిలోని గనులు వాటి పనితీరు గురించి వివరించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ అరెల్లి పోషం, ఏరియా ఇంజనీర్ డీవీరావు, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, డీజీఎం(పర్సనల్) పర్సనల్ కిరణ్ బాబు, ఎస్ఓఎం రమేష్ బాబు, అధికారులు అల్లావుద్దీన్, వెంకటేశ్వర్లు, శంకర్, గణేష్, రంగు శ్రీను, ఎగ్జిక్యూటివ్ స్టాఫ్, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లి గనిలో రక్షణ పక్షోత్సవాలు..



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిలో బుధవారం 55వ రక్షణ పక్షోత్సవాలు జరిగాయి. రక్షణ పతాకాన్ని జీఎం వెంకటయ్య ఆవిష్కరించారు. తనిఖీ బృందం గనిలో తనిఖీలు నిర్వహించారు. రక్షణపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండడం, పని స్థలాల్లో రక్షణ సూత్రాలు పాటించేలా అవగాహన కల్పించడం, గనిలో తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించేందుకు తనిఖీ బృందం పర్యటిస్తుందని బృందం కన్వీనర్ హబీబ్ హుస్సేన్ పేర్కొన్నారు. పని స్థలాల్లో చిన్నపాటి నిర్లక్షం కూడా వహించవద్దని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తేనే సంస్థకు ఉజ్వలల భవిష్యత్తు ఉంటుందని ఆర్జీ-2 జీఎం వెంకటయ్య పేర్కొన్నారు. రక్షణలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అధికారులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, మల్టీ డిపార్ట్‌మెంటల్ సభ్యులు కనకయ్య, చంద్రశేఖర్, దేశాయి, రహమాన్, అమర్నాథ్ పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు



సమావేశంలో పాల్గొన్న జీఎంలు, అధికారులు

రామగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఈనెల23న ఘనంగా నిర్వహించాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం జీఎం చాంబర్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు చర్చించారు. రాణి రుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో, అదే విధంగా వివిధ గనులు, విభాగాల్లో నిర్వహించాల్సిన ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. వేడుకలపై ప్రధానంగా దృష్టి సారించి విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు రఘుపతి, వై.వి శేఖర్‌బాబు, శ్రీనివాసులు, రామ్మోహన్, వెంకటరమణ, రాజశేఖర్, సుదర్శనం, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వర్‌రావు, ఐలయ్య, రాజారెడ్డి, రాజేశ్వరి, షబ్బీరుద్దీన్, గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్‌లో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో బుధవారం ఐఎన్‌టీయూసీ గేట్‌మీటింగ్ జరిగింది. యూనియన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని, కార్మిక సంఘాల ఉనికిని దెబ్బతీసేలా అప్పటి ప్రభుత్వం నడుచుకున్నట్లు ఆరోపించారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ విఫలమైనట్లు పేర్కొన్నారు. పదినెలల కాలంలో యాజమాన్యంతో ఒక్క అగ్రిమెంట్ చేసుకోకపోవడం ఏఐటీయూసీ చేతగానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఐఎన్‌టీయూసీ ఈ పది నెలల కాలంలో అపరిష్కృతంగా ఉన్న వాటిని పరిష్కరించామని, ఎన్నికల సందర్భంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ధర్మపురి పేర్కొన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో జనరల్ సెక్రెటరీ అక్రం, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు వంగ సురేష్, దశరథం, నరసింహారెడ్డి, శ్యాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ పిట్ కమిటీ పరిచయ కార్యక్రమం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ఎస్అండ్‌డీ టీబీజీకేఎస్ పిట్‌కమిటీని బుధవారం సెక్షన్ ఇంచార్జి జనార్ధన్‌కు ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పరిచయం చేశారు. పిట్‌సెక్రెటరీగా దాసరి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీలుగా సదయ్య, ప్రవీణ్‌రావులను నియమించినట్లు అయిలి శ్రీనివాస్ తెలిపారు. పిట్ కమిటీ తీసుకువచ్చే కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా సహకరించాలని హెచ్ఓడీని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, రత్నాకర్, శ్రీనివాస్‌తోపాటు పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మల్టీ డిపార్టమెంట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిని మాతృ సంస్థగా భావిస్తూ ఉత్పత్తికి సమష్టిగా సహకరించాల్సిందిగా సూచించారు. ఉద్యోగిగా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. పని గంటలు వృథా చేయకుండా అంకితభావంతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం కంపెనీ భవిష్యత్ కార్యాచరణ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి పలు సలహాలు, సూచనలు అందుకున్నారు. ఈ సమావేశంలో అధికారులు శేఖర్‌బాబు, రఘుపతి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రామ్మోహన్, సుదర్శనం, రాజేంద్రకుమార్, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, ఐలయ్య, రాజేశ్వరి, గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.